సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం। 29। నవంబర్। 2023



జిల్లాకు వర్ష సూచన

ఉమ్మడి జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.



'ఖుషీ'గా సినిమాల్లోకి..

రొళ్ల మండలం తిరుమలదేవరపల్లికి చెందిన ఖుషీగౌడ్ వెండితెరపై వెలిగిపోతోంది. అటు శాండల్‌వుడ్ ఇటు కోలీవుడ్‌లోనూ హీరోయిన్‌గా రాణిస్తోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.6°/ 19.3°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 4 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

దార్శనికుడు జ్యోతిరావు పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, సమసమాజ స్థాపనకు కృషి చేసిన దార్శనికుడు జ్యోతిరావు పూలే అని డీఆర్‌ఓ కొండయ్య అన్నారు. మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ కొండయ్య అధికారులు, సిబ్బందితో కలిసి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... అసమానతలు రూపుమాపడం, స్త్రీలకు విద్య అందించి వారి స్థితిగతులను మార్చడంతో పూలే ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. పూలే జీవితం మనందరికీ ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సంక్షేమ, సాధికారత శాఖ అధికారులు నిర్మలాజ్యోతి, మోహన్‌రామ్, శివరంగప్రసాద్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నల్లమాడలో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్య పరిష్కారం కోసం మండల స్థాయిలో నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని బుధవారం నల్లమాడలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లమాడ ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కారానికి చర్యలు తీసుంటామన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

4న రాప్తాడులో సామాజిక సాధికార యాత్ర



తగరకుంటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: డిసెంబర్ నాలుగో తేదీ రాప్తాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కనగానపల్లి మండలం మద్దెలచెరువు, భానుకోట, కేఎస్ పాళ్యం, నరసంపల్లి, తగరకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా రాప్తాడులో జరిగే సామాజిక సాధికార యాత్రపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతీ ప్రసాద్, మండల అగ్రీ బోర్డు చైర్మన్ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ నిర్వహణకు అనుమతి



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం స్నాతకోత్సవం నిర్వహించడానికి గవర్నర్/ఛాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చారు. వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్ రాజభవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. స్నాతకోత్సవ నిర్వహణకు ఆయన సమ్మతించారని, తేదీ త్వరలోనే ఖరారు చేస్తామన్నారని వీసీ వెల్లడించారు.

రైతుకు 'పవర్'



భానుకోటలో విద్యుత్ సబ్ స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి. చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు

- అందుబాటులోకి భానుకోట, గట్లు సబ్‌స్టేషన్లు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్
- ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఓడీచెరువు మండలం మామిళ్లకుంట్లపల్లి సబ్‌స్టేషన్‌కూ భూమిపూజ

కనగానపల్లి/కదిరి అర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగానే రైతులకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసున్నారు. కనగానపల్లి మండలం భానుకోట సమీపంలో కేవీ పంపనూరు తండా వద్ద రూ.110.5 కోట్లతో నిర్మించిన 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, కదిరి మండల పరిధిలోని గట్లు వద్ద రూ.81.93 లక్షలతో నిర్మించిన 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంగళవారం సీఎం జగన్ తాడేపల్లి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే ఓడీచెరువు మండల పరిధిలోని మామిళ్లకుంట్లపల్లి వద్ద రూ.23 కోట్లతో నిర్మించనున్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగనివ్వం

ఆరుగాలం శ్రమించి తన స్వేదంతో దేశానికే అన్నం పెట్టే రైతన్నకు ఇబ్బందులు కలగనివ్వబోమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం భానుకోట సమీపంలోని కేవీ పంపనూరు తండా వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని, తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగి రాష్ట్రం కూడా అభివృద్ధి వైపు నడుస్తుందని సీఎం జగన్ భావిస్తున్నారన్నారు. అందువల్లే ఎక్కడికక్కడ సబ్‌స్టేషన్లు నిర్మించి వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. కేవీ పంపనూరు తండా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా కళ్యాణదుర్గం, రాప్తాడు నియోజక వర్గాల్లోని సుమారు 2 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం కలుతుందన్నారు. ఈ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, తగరకుంట, కనగానపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల విద్యుత్ అందిస్తామన్నారు. ఆయా సబ్‌స్టేషన్‌ల నుంచి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. రాప్తాడు నియోజక వర్గంలో ఇప్పటికే కొత్తగా ఐదు విద్యుత్ స్టేషన్లు నిర్మించామని, మద్దెలచెరువు, గొరిదిండ్ల వద్ద మరో రెండు సబ్ స్టేషన్లు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీ నాగేంద్ర, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

వ్యవసాయానికి 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తామని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి గట్ల వద్ద నిర్మించిన 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేవుడి దయ, ముఖ్యమంత్రి చల్లని పాలనలో రైతులంతా ఆనందంగా ఉన్నారన్నారు. సాగునీటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే హంద్రీ నీవా నీటితో నియోజకవర్గంలోని అన్నిచెరువులూ నింపామన్నారు. ప్రస్తుతం ఏ చెరువు చూసినా నిండుకుండలా తొణికిసలాడుతోందన్నారు. తద్వారా భూగర్భ జలమట్టం కూడా భారీగా పెరిగి నీరు పుష్కలంగా అందుబాటులో ఉందన్నారు. దీంతో రైతులంతా పంటలు సాగు చేస్తుండగా, వ్యవసాయానికి విద్యుత్ వినియోగమూ పెరిగిందన్నారు. ఈ క్రమంలోనే అక్కడక్కడా విద్యుత్ సరఫరాలో కాస్త అంతరాయం కలిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లగానే, వెంటనే విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారన్నారు. గట్లవద్ద నిర్మించిన 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వల్ల ఈ ప్రాంత వ్యవసాయ కనెక్షన్‌లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వంశీకృష్ణారెడ్డి, విద్యుత్ శాఖ డీఈ మెసెస్, ఏడీ శ్రీనివాసులు, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్యతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.23 కోట్లతో సబ్ స్టేషన్...శంకుస్థాపన చేసిన సీఎం

ఓడీచెరువు : మండల పరిధిలోని మామిళ్లకుంట్లపల్లి వద్ద రూ.23 కోట్లతో నిర్మిస్తున్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విద్యుత్ సమస్యతో ఏ రైతన్నా ఇబ్బంది పడకూడదని భావించి పగటి సమయంలోనే 9 గంటల విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టామని సీఎం తెలిపారు. ఈ క్రమంలోనే లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ మామిళ్లకుంట్లపల్లి వద్ద 132 కేవీ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఓడీచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాలకు కదిరి వద్దగల కూటగుళ్ల నుంచి విద్యుత్ సరఫరా జరిగేదన్నారు. దీనివల్ల లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమయ్యేదన్నారు. దీంతో మోటార్లు ఆడక రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. మామిళ్లకుంట్లపల్లి సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే రైతులకు 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. పంటల సాగుకూ ఇబ్బందులు తప్పుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, ఓడీచెరువు, అమడగూరు మండలాల ఎంపీపీలు పర్వీన్ భాను, ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షామీర్ బాషా, మండల సలహా మండలి అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజు నాయుడు, పట్టణ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌కు భూమిపూజ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓటరు జాబితా సవరణ పక్కాగా జరగాలి





మాట్లాడుతున్న ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, సమీక్షకు హాజరైన అధికారులు, వివిధ పార్టీల నాయకులు

- నూతన జాబితాపై ఒక్క అభ్యంతరమూ ఉండకూడదు
- నిబంధనల ప్రకారం క్లెయిమ్‌లు పరిష్కరించాలి
- అధికారులకు జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఆదేశం

పుట్టపర్తి అర్బన్: ''ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన క్లెయిమ్‌ల పరిష్కారం పక్కాగా జరగాలి. జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి రికార్డులన్నీ అందుబాటులో ఉంచుకోవాలి. రాజకీయ పార్టీల నుంచి అందిన అభ్యంతరాలు, ఓట్ల తొలగింపునకు అందిన క్లెయిమ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతనే పరిష్కరించాలి'' అని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఓటరు జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నిబంధనల ప్రకారం తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. అందిన క్లెయిమ్‌లన్నీ ఎప్పటికప్పుడు పరిష్కారించాలన్నారు. ఓటరు తుది జాబితా తయారీలో అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలన్నారు.

రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... ఓటు తొలగింపు, నమోదుపై నిర్దిష్టమైన ఆధారాలతో రాతపూర్వక ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే ప్రజాప్రాతినిధ్యం చట్టం 1950 (సెక్షన్ 31) ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచనామా సమాచారం ఇస్తే మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. నూతన ఓటర్ల చేర్పులు, తొలగింపులపై 10 రోజుల్లో దరఖాస్తులన్నీ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. నూతన ఓటర్ల నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి అన్ని వివరాలను తెలియజేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ క్లెయిమ్ అభ్యంతరాలకు సంబంధించి, సిమిలర్ ఎంట్రీస్, జంక్ క్యారెక్టర్లు, పది మంది ఓటర్లు ఉన్న కుటుంబాలు, జెండర్ నిష్పత్తి, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవంబర్ 27వ తేదీ వరకూ ఫారం-6కు సంబంధించి 21,842 దరఖాస్తులు స్వీకరించామని, అందులో 16,300 పరిష్కరించామని వివరించారు. మరో 2,088 దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు. ఫారం-7కు సంబంధించి 17,471 దరఖాస్తులను స్వీకరించామని, అందులో 9,639 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. మిగితా 1,975 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, స్వీప్ అధికారి శివరంగ ప్రసాద్, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ నాయకుడు రాజు, కాంగ్రెస్ నాయకుడు గౌస్‌బాషా, సీపీఎం నాయకుడు ఇంతియాజ్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

పుట్టపర్తి: బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... బుక్కపట్నం గ్రామానికి చెందిన ఓ బాలిక తన తల్లి సూచన మేరకు ఇంటి సమీపంలోని ఓ జనరల్ స్టోర్‌లో బర్ఫీ కొనుగోలు చేసేందుకు 2021 మార్చి 6వ తేదీ రాత్రి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న బుక్కపట్నం గ్రామానికి చెందిన బెస్త మహేష్ (29) బాలిక చేయిపట్టుకొని పక్కకు లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. అంతేకాకుండా లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించాడు. వెంటనే బాలిక గట్టిగా అరవడంతో చుట్టు పక్కలవారు పరిగెత్తుకుని అక్కడికి రాగా, మహేష్ పారిపోయారు. ఘటన అనంతరం బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా బుక్కపట్నం ఎస్‌ఐ మహేంద్రభూపతి కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును పీపీ విద్యాపతి వాదించగా... పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి 8 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి మహేష్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ. లక్ష నష్ట పరిహారం చెల్లించాలని తీర్పులో వెల్లడించారు. దోషులను శిక్షపడేలా సాక్షులను ప్రవేశపెట్టిన ఎస్‌ఐ నరసింహులు, కోర్టు పీసీ శివయ్యను ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సమ్మేటివ్–1 పరీక్షలు ప్రారంభం



బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సమ్మేటివ్ (ఎస్‌ఏ)-1 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశ్నాపత్రాలతోనే పరీక్ష నిర్వహించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 2,087 పాఠశాలలు పనిచేస్తుండగా, ఆయా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ 2,44,174 మంది విద్యార్థులు చదువుతున్నారు. మంగళవారం జరిగిన పరీక్షకు 95 శాతం మంది హాజరైనట్లు డీఈఓ వెల్లడించారు. 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12.30 వరకు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్ష నిర్వహించామన్నారు. డిసెంబర్ 8వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయని డీఈఓ వెల్లడించారు.

ప్రకృతి సేద్యానికి అనంత అనుకూలం

- అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం
- రెండోరోజు బత్తలపల్లి, కనగానపల్లి మండలాల్లో పర్యటన



గంటాపురంలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు

బత్తలపల్లి/కనగానపల్లి: ప్రకృతి సేద్యానికి ఉమ్మడి అనంతపురం జిల్లా వాతావరణం అనుకూలంగా ఉందని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం అభిప్రాయ పడింది. లావోస్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, ట్యునీషియా, పెరూ వంటి దేశాలకు చెందిన 60 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకుల బృందం రెండోరోజు మంగళవారం రైతు సాధికార సంస్థ వైస్ చైర్మెన్ విజయ్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ తదితరులతో కలిసి బత్తలపల్లి, కనగానపల్లి మండలాల్లో పర్యటించింది. తొలుత బత్తలపల్లి మండలం గంటాపురంలో పర్యటించిన శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సాగు చేస్తున్న పంటలు, దిగుబడులు, అంతర పంటలు, ఆదాయ మార్గాలపై స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బత్తలపల్లిలోని భారతి మండల సమాఖ్య భవనంలో 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం-స్వయం సహాయక సంఘాల పాత్ర'పై మండల సమాఖ్య సభ్యులతో చర్చించారు. అనంతరం శాస్త్రవేత్తలు కనగానపల్లి మండలంలోని పర్వతదేవరపల్లిలో పర్యటించారు. గ్రామంలో ఏటీఎం పద్ధతిలో పంటలు సాగుచేస్తున్న రైతులు సునీత, నాగేశ్వరరెడ్డి, ఆనంద రెడ్డి పొలాలను పరిశీలించారు. పంటల సాగు కోసం రైతులు సొంతంగా తయారు చేసుకుంటున్న సేంద్రీయ ఎరువులు, కషాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పొందుతున్న లబ్ధి, ప్రజల ఆరోగ్యానికి కలిగే ఉపయోగాలను గురించి తెలుసుకున్నారు.

ఆల్ ఇండియా స్థాయి జూడో పోటీలకు ఎంపిక



విద్యార్థిని యువను అభినందిస్తున్న సీఐ సుబ్రమణ్యం

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని గవ్వల యువ ఆల్ ఇండియా జూడో ఉమెన్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21 నుంచి 24 వరకూ కేరళ రాష్ట్రంలో జరిగిన సౌత్ ఇండియన్ ఉమెన్స్ జూడో ఛాంపియన్ షిప్ పోటీల్లో యువ పాల్గొంది. గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో డిసెంబరులో ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా జూడో ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విద్యార్థిని సీఐ సుబ్రమణ్యం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మేరివరకుమారి, జూడో క్లబ్ కోచ్ ఇనాయత్‌బాషా తదితరులున్నారు.

వృద్ధురాలి బలవన్మరణం



నరసమ్మ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామానికి చెందిన నరసమ్మ (70) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం బద్దలాపురం గ్రామానికి చెందిన నరసమ్మకు 40 ఏళ్ల క్రితం ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామానికి చెందిన నరసింహులుతో వివాహమైంది. పెళ్లి తర్వాత రెండేళ్లు కలిసే ఉన్న వీరు ఆ తర్వాత వ్యక్తిగత కారణాలతో విడిపోయారు. అప్పటి నుంచి నరసమ్మ బద్దలాపురంలోనే నివాసముంటోంది. నాలుగు నెలల క్రితం భర్త నరసింహులు చనిపోవడంతో మదిగుబ్బకు చేరుకుంది. ఈ క్రమంలోనే భర్త ఆలోచనలతో దిగాలు చెందిన ఆమె మంగళవారం ఉదయం గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'ఖుషీ'గా సినిమాల్లోకి

బిడ్డలో నైపుణ్యాన్ని ఆ తల్లిదండ్రులు గుర్తించారు. వెన్నుతట్టి ప్రోత్సహించారు. వారి నమ్మకాన్ని ఆ కుమార్తె వమ్ము చేయలేదు. ఆసక్తి పెంచుకున్న రంగంలో కష్టపడింది. అంచెలంచెలుగా ఎదిగింది. హీరోయిన్ స్థాయికి చేరింది. ఏకకాలంలో రెండు భాషల్లో తెరకెక్కుతున్న సినిమాలో నటిస్తోంది. ఖుషీగౌడు స్ఫూర్తిదాయక ప్రస్థానమిది.

- నటనలో రాణిస్తున్న రొళ్ల మండలవాసి ఖుషీగౌడు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం
- 2021 మిస్ కర్ణాటక అందాల పోటీల్లో టైటిల్ విజేత
- ఆర్‌కే గాంధీ 'త్రిష' సినిమాలో హీరోయిన్‌గా ఛాన్స్



దర్శకుడు ఆర్‌కే గాంధీ, నటుడు సుమన్‌తో కలిసి సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఖుషీగౌడు (ఫైల్)

రొళ్ల: మండలంలోని తిరుమలదేవరపల్లికి చెందిన భారతి, బాలకృష్ణ దంపతుల రెండో కుమార్తె ఖుషీగౌడు నటనలో రాణిస్తోంది. ప్రేమభిక్షం, ఆగస్టు 6 రాత్రి, రుద్రాక్షపురం వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు ఆర్‌కే గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'త్రిష' సినిమాలో హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. తమ గ్రామానికి చెందిన యువతి సినిమాల్లో నటిస్తుండడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు

ఖుషీగౌడు తల్లిదండ్రులది మధ్య తరగతి కుటుంబం. ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే కొనసాగింది. తండ్రి వ్యాపార రీత్యా కర్ణాటక రాష్ట్రం తుమకూరు పట్టణంలో స్థిరపడ్డారు. ఖుషీగౌడు చిన్న వయసులోనే నటనపై ఆసక్తి పెంచుకుంది. పాఠశాల, కళాశాల స్థాయిలో నాటికల్లో విభిన్న పాత్రలు వేసి అందరి మన్ననలు పొందింది. కుమార్తెకు నటనపై ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు ప్రోత్సహించారు. దీంతో ఆమె మరింత ఉత్సాహంగా ముందుకు సాగింది. 2020 మిస్‌టీన్ కర్ణాటక, 2021 మిస్ కర్ణాటక అందాల పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. న్యాయ నిర్ణేతలను మెప్పించి టైటిళ్లను సొంతం చేసుకుంది. దీంతో ఆమెకు సినిమాల్లో అవకాశాలొచ్చాయి. కన్నడలో ఇటీవల అహుతాల సూర్య తెరకెక్కించిన మాస్టర్ ప్లాన్ చిత్రంలో నటించింది.

హీరోయిన్‌గా ఛాన్స్..

ఖుషీగౌడు చేసిన నాటికలు, వివిధ ప్రదర్శనలను ఆన్‌లైన్‌లో చూసిన ప్రముఖ దర్శకుడు ఆర్‌కే గాంధీ తను తెరకెక్కిస్తున్న 'త్రిష' చిత్రంలో హీరోయిన్‌గా ఆమెకు ఛాన్స్ ఇచ్చారు. భక్తిభావానికి ప్రతీకగా చిత్రం ఉండనున్నట్లు తెలిసింది. స్నేహాలయ క్రియేషన్స్ బ్యానర్‌పై తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుగుతోంది. చిత్రంలో శివుడి పాత్రలో ప్రముఖ నటుడు సుమన్ నటిస్తుండడం గమనార్హం. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవంలో ప్రముఖులతో కలిసి ఖుషీగౌడ్ పాల్గొంది. నాలుగు రోజుల పాటు అక్కడి మియాపూర్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ కూడా చేపట్టారు. త్వరలో రాష్ట్రంలోని ప్రముఖ ప్రదేశాలతో పాటు కర్ణాటక రాష్ట్రం హొసకోట తాలూకా భక్తరహళ్లి, చిక్కబళ్లాపుర తాలూకా అజ్జవార, ముళబాగిలు తాలూకా విరుపాక్ష దేవాలయం తదితర ప్రాంతాల్లో కూడా షూటింగ్ జరగనుందని సమాచారం. వచ్చే ఏడాది మహాశివరాత్రి నాటికి ఈ సినిమా వెండి తెరపై విడుదల కానున్నట్లు తెలిసింది.



మిస్ కర్ణాటక అందాల పోటీల టైటిల్‌తో ఖుషీగౌడు (ఫైల్)

తల్లిదండ్రుల సహకారం మరువలేనిది

చిన్న వయసులోనే నాలో ఉండే నైపుణ్యాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. వెన్నంటే ప్రోత్సహించేవారు. ప్రాథమిక దశలో ఎంతో చురుగ్గా ఉండేదాన్ని. ఐదారేళ్లున్నప్పుడు నృత్యాలు, విభిన్న ఆటల పోటీల్లో పాల్గొనేదాన్ని. అందులో భాగంగానే 2020లో కర్ణాటక మిస్‌టీన్, 2021 మిస్ కర్ణాటక అందాల పోటీల్లో ప్రతిభ కనబరచి టైటిళ్లు కూడా సొంతం చేసుకున్నా. నా నటనా కౌశలాన్ని గుర్తించిన ప్రముఖ దర్శకుడు ఆర్‌కే గాంధీ హీరోయిన్‌గా తన చిత్రంలో అవకాశం కల్పించారు. తెలుగు, కన్నడ భాషలో ఏకకాలంలో తెరకెక్కుతున్న 'త్రిష' మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నా. హైదరాబాద్‌లో షూటింగ్ కూడా ప్రారంభమైంది. తల్లిదండ్రుల సహకారంతోనే ఇదంతా సాధ్యమైంది.

– ఖుషీగౌడు

కక్కలపల్లి గ్యాస్ లీక్ ఘటనలో మరొకరి మృతి



రామాంజనమ్మ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో గ్యాస్ లీకై మంటలు చెలరేగిన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. వివరాలు... కక్కలపల్లికి చెందిన బోయ వెంకట్రాముడు, రామాంజనమ్మ దంపతులతో పాటు వెంకట్రాముడు తమ్ముడి కుమారుడు హేమంత్ ఈ నెల 16న రాత్రి ఇంట్లో నిద్రించారు. 17న వేకువజామునే వెంకట్రాముడు బాతురూంకెళ్లి స్నానం కోసమని గీజర్‌కు అమర్చిన ట్యాప్‌ను ఆన్ చేయగానే పెద్దశబ్దం వచ్చింది. అప్పటికే ఇల్లు మొత్తం గ్యాస్ వ్యాపించి ఉండడంతో ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. ఘటనలో వెంకట్రాముడుతో పాటు బెడ్‌రూంలో నిద్రిస్తున్న రామాంజనమ్మ, హేమంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తొలుత సర్వజనాస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ నెల 21న హేమంత్ మృతి చెందాడు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనమ్మ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. వెంకట్రాముడు చికిత్స పొందుతున్నాడు.

ముగిసిన హెచ్చెల్సీ కోటా

అనంతపురం సెంట్రల్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది జిల్లాకు అందాల్సిన హెచ్చెల్సీ కోటా నీరు పూర్తయింది. మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో నీటిని నిలుపుదల చేశారు. ఇప్పటి వరకూ 17.363 టీఎంసీల నీటిని విడుదల చేయగా ప్రవాహ నష్టాలు పోనూ జిల్లా సరిహద్దులో 16.070 టీఎంసీలు చేరినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 495 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6,802 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదులుతున్నారు. కనిష్ఠంగా 14.814 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జిల్లాలోని పీఏబీఆర్‌లో 2.403 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 0.605 టీఎంసీలు నీటి నిల్వ ఉన్నట్లు ఎస్‌ఈ రాజశేఖర్ వివరించారు.

హేమలత ఆత్మహత్యకు వేధింపులే కారణం

- నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసులు

అనంతపురం క్రైం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయి హేమలత (28) ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణమని అనంతపురం నాల్గో పట్టణ సీఐ ప్రతాప రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో అత్తతో పాటు భర్త, అతని తమ్ముడు, ఆడపడుచుని అరెస్ట్ చేసినట్లు వివరించారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన సాయి హేమలతకు అనంతపురం నగర శివారులోని పీవీకేకే కళాశాల సమీపంలో నివాసముంటున్న కళ్యాణ చక్రవర్తితో 9 నెలల క్రితం వివాహమైంది. అత్తారింట్లో కాలు పెట్టినప్పటి నుంచి అదనపు కట్నం కోసం ఆమెను భర్త, కుటుంబ సభ్యులు వేధించేవారు. విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో పలుమార్లు పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఈ క్రమంలోనే సాయి హేమలతకు ప్రతి నెలా వచ్చే వేతనాన్ని ఎప్పటికప్పుడు కళ్యాణ్ తన ఖాతాలోకి మళ్లించుకునేవాడు. కనీస ఖర్చులకు సైతం డబ్బు ఇచ్చేవాడు కాదు. గత వారం భర్త, కుటుంబసభ్యులు ఉత్తర కర్ణాటక సందర్శనకు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని సాయి హేమలతకు తెలపడంతో ఆమె రుతుక్రమ ఇబ్బందుల కారణంగా యాత్రను వాయిదా వేయాలని కోరింది. దీంతో ఆమె మనోభావాలను కించపరిచేలా మాట్లాడి కుటుంబసభ్యులతో కలసి యాత్రకు భర్త తరలివెళ్లాడు. టూర్‌లో ఉన్న భర్తకు ఆమె పలు మార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిహేమలత గత ఆదివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై సాయి హేమలత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు నిర్ధారణ కావడంతో కళ్యాణ్‌చక్రవర్తి, లక్ష్మీనరసమ్మ, కుమార్ ప్రేమ్‌సాయి, వరలక్ష్మిపై వేధింపుల కేసు నమోదు చేసి, మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితులను న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పట్టాలపై మృతదేహం

హిందూపురం అర్బన్/పెనుకొండ రూరల్: హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెనుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం హిందూపురం వైపు నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్నట్లు రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ తెలిపారు. ఫుల్ షర్ట్, లుంగీ ధరించాడన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9441238182కి సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు సూచించారు.

మామిడిలో యాజమాన్యం చేపట్టాలి



పూత దశలో ఉన్న మామిడి చెట్టు

పుట్టపర్తి అర్బన్: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడిలో పలు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. కొన్ని రోజులుగా నెలకొంటున్న ఉష్ణోగ్రతలు పూత మొగ్గ తొడగడానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. డిసెంబరు మొదటి వారంలో మామిడికి మొదటి తడి ఇవ్వాలన్నారు. ఈ లోపు వర్షం పడితే తడి అవసరం లేదన్నారు. పూత సరిగా రావడానికి మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు, సల్ఫర్ రెండు గ్రాములు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వారం రోజుల తర్వాత ఇమిడోక్లోఫిడ్ 0.5 మిల్లీ లీటరు, హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటరు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మరో వారం తర్వాత 13:0:45 మందు 10 గ్రాములు, కార్బన్‌డిజం 1 గ్రాముకు క్లోరోఫైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా లామ్డాసైలోత్రిన్ 1.5 ఎంఎల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం సైతం తడిచేలా చేస్తే బెరడులో ఉన్న తేనె మంచు పురుగు నశిస్తుందని తెలిపారు.

శ్రీనివాస నగర్‌లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్

అనంతపురం క్రైం: నగరంలోని శ్రీనివాస నగర్‌లో నివాసముంటున్న న్యాయవాది ఆనంద్ ఇంట్లో దొంగలు పడ్డారు. సోమవారం ఆనంద్, తన భార్య సుజాతతో కలసి శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటికి వేసిన గ్రిల్ తాళాలు బద్దలుకొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చిన దంపతులు లోపలకు వెళ్లి పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం అందించడంతో త్రీ టౌన్ సీఐ ధరణీకిషోర్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమార్తెను పలకరించి త్వరగా వద్దామనే భావనతో ఇంటి మెయిన్ డోర్‌కున్న గ్రిల్‌కు మాత్రమే తాళం వేసి ఊరెళ్లినట్లుగా గుర్తించారు. అయితే అనుకున్న సమయానికి వారు రాలేకపోవడం దొంగలకు అనువుగా మారిందన్నారు. బీరువాలోని 7 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అవి పనిచేయలేదు. దీంతో చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



గాయపడిన అఫ్రోజ్

గుంతకల్లు టౌన్: కుక్కల దాడిలో ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని అల్లీపీరా కాలనీకి చెందిన షేక్ నూర్ మహమ్మద్, నస్రీన్ దంపతుల మూడేళ్ల వయసున్న కుమార్తె అఫ్రోజ్... స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం తల్లి స్కూల్ వద్దకెళ్లి కుమార్తెను పిలుచుకుని ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యంలో తల్లి ముందు నడుస్తుండగా ఆ వెనుకనే అనుసరిస్తున్న చిన్నారిపై వీధి కుక్క దాడి చేసింది. గమనించిన తల్లి వెంటనే కుక్కను అదిలించబోతే ఆమెపై తిరగబడింది. అప్రమత్తమైన స్థానికులు వెంటనే కుక్క బారి నుంచి తల్లీబిడ్డను కాపాడి స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీధుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి విన్నవించారు.

కోర్టును తప్పుదోవ పట్టించిన కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: నకిలీ పత్రాలు, స్టాంపులు ఉపయోగించి కోర్టును తప్పుదోవ పట్టించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. ఓ కేసులో నిందితులుగా ఉన్న నల్లచెరువు మండలం తిరుమల దేవరపల్లికి చెందిన వెంకటశివ, కుటాగుళ్ల బావయ్యలు బెయిల్‌కు సంబంధించి సొంతంగా అధికారుల సంతకాలు పెట్టి, దొంగగా స్టాంపులు వేశారన్నారు. దీనిపై కదిరి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కదిరి గట్లు సమీపంలో మంగళవారం నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో కదిరి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. కేసులో ప్రధాన సూత్రధారి ఎస్.భాస్కర్ పరారీలో ఉన్నాడని, త్వరలో అతడిని కూడా అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు.

2న మెగా జాబ్ మేళా

కదిరి అర్బన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో డిసెంబర్ 2న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు వంద మల్టీ నేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, బీటెక్, పీజీ చదివిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7989888299, 9676706976 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

4న సర్టిఫికెట్ల పరిశీలన

లేపాక్షి: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 1 నుంచి 15 వరకూ దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను కర్నూలు ఆర్టీసీ కార్యాలయంలో డిసెంబరు 4న పరిశీలిస్తారని జిల్లా ఐటీఐ కన్వీనర్ రాయపురెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట కార్యక్రమం సాగుతుందన్నారు. డీజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో దరఖాస్తు చేసుకున్న వారు హాజరు కావాలని కోరారు.

ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఉమామహేశ్వరనగర్‌కు చెందిన రోషమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఇంటి తాళాలను పగులగొట్టి లోనికి చొరబడిన దుండగులు బీరువాలోని అర తులం బంగారు కమ్మలు, రూ.40 వేలు నగదు అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి

- పోలీసుల అదుపులో భర్త



చికిత్స పొందుతున్న దేవి



నిందితుడు రవి

గుత్తి: అనుమానం పెనుభూతమైంది. తాగుడుకు బానిసైన వ్యక్తి చివరకు నిద్రిస్తున్న తన భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎస్సీ కాలనీకి చెందిన రవి, దేవి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. మద్యానికి బానిసైన రవి జులాయిగా మారాడు. ఈ క్రమంలోనే మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ భార్యను వేధించేవాడు. దీనికి తోడు కొన్ని రోజులుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యపై గొడలితో దాడి చేశాడు. తలపై మూడు సార్లు నరికాడు. రక్తపు మడుగులో పడి ఉన్న దేవిని చూసి చనిపోయిందని భావించి పరారయ్యాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే దేవిని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రవిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సీఐ వెంకట్రామిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.